# పేదల బతుకు

**బియార్**

పేదల బతుకుల్ని గురించి మాట్లాడేటప్పుడు 'పూట గడిచేదెట్లా' అనడం వింటూ వుంటాము. వారాల విద్యార్థుల పూట ఎలా గడిచిందో చూడండి!

**ఉదయాన్నే వారం గుర్తుచెయ్యటానికి ఊళ్ళోకి వెళ్ళిన చినశాస్త్రి పాఠశాలకు తిరిగివస్తున్నాడు.**

**పీలగా పిడికెడు మనిషి. పట్టుమని పన్నెండేళ్ళు వుండవు. అంగవస్త్రాన్ని బిళ్ళగోచిపోసి కట్టాడు. వెనకా ముందూ పెట్టిన కుచ్చెళ్ళకి అసలే ఈసురోమంటున్న ఆ పొట్ట మరీ నడుముకి అతుక్కుపోయినట్టు కనిపిస్తోంది.**

పిటబోరమీద మీనుమీసంలాంటి జందెం. ఇంకా ముడికి అందని శిఖ తల కొంచెం మాసింది. ఇదీ చినశాస్త్రి రూపం. ఇంకా స్నానసంధ్యలుపూర్తి అయినట్టులేదు, ముఖంమీద విభూతిరేఖలు కనిపించడం లేదు.

దారిలో ఏ చెట్టుకింద ఏరుకున్నాడో యేమో నేరేడుపళ్ళు గుప్పిటలో పట్టుకొని, బొటనవేలూ చూపుడువేల్తో కసిగాటుగా తింటూ–ఊస్తూ నడుస్తున్నాడు. రెండోచేత్తో నారతీసిన తాటికమ్మ నేలమీద ఈడుస్తున్నాడు.

అతనికి కొంచెం ముందుగా ఓ ఊరకుక్క బరాబరులు చేస్తున్నట్టు పరుగులాంటి నడక సాగిస్తోంది. వున్నట్టుండి అడ్డంతిరిగి అతనికేసి చూసి మొరుగుతోంది. అతను చేతిలోవున్న తాటికమ్మని ఒకసారి ఝళిపించి నేలమీద ఠాప్‌మని కొట్టాడు. భయపడ్డట్టుగా అది కొంచెం ముందుకి గెంతి. మళ్ళీ అదేనడక అల్లాగే సాగిస్తోంది.

అతడు కొడతాడనే భయం దానికిలేదు. కొట్టలేడని కూడా నమ్మకమేమో! అయితే అతన్ని కరవాలనే కోరిక కూడా దానికి ఉన్నట్టులేదు. ఊరికే అల్లరి పెడుతోందంతే—

చినశాస్త్రి పాఠశాల ఆవరణలో ప్రవేశించి గేటు వేసేశాడు. చేతిలో ఉన్న తాటికమ్మ ఆ కుక్కకి తగలాలనే గేటుమీద నుంచి విసిరేసి లోపలికి వెళ్ళిపోయాడు. తాటికమ్మని తప్పించుకొని మరికొంచెంసేపు అక్కడే నిలబడి మొరిగి అదీ ఎటో వెళ్ళిపోయింది.

చినశాస్త్రి ఆ పాఠశాలలో భాషాప్రవీణ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

బిడ్డపోయినా పురిటికంపు వదలనట్టు వేదాధ్యయనం యేనాడోపోయినా దానికి పాఠశాల అనే పేరు మాత్రం వుండిపోయింది. శుభ సుఖాలకి అవసరాలు వచ్చినప్పుడు ఊళ్ళో కొందరికి ఈ పాఠశాల గుర్తుకి వస్తుంది.

సర్కారువారి దృష్టిలో అది మగపిల్లల ఓరియంటల్ కాలేజీ. అయితే అటువంటివి కొన్ని తమ ఏలుబడిలో వున్నట్టు బహుశ వారికి ఏనాడూ గుర్తుకి రాదు.

కాలేజీ అంటే ఏమో అనుకునేరు. ఊరుకి ఒక ఫర్లాంగు దూరంలో నాలుగు మామిడి చెట్లున్న చిన్న ఆవరణలో రెండు పెంకుటిళ్ళు అందులో ఒకటి బంగళా పెంకులిది. రెండోది మామూలు పెంకులిది. మొదటిది తూర్పునుంచి పడమరకుంది. ఇందులోనె క్లాసులూ, ఆఫీసూ సమస్తమూను. రెండోది ఉత్తర దక్షిణాలుగా వుంది. అది హాస్టలు. దాని నడికప్పు కుంగి తిరగేసిన కావిడిబద్దలా కనపడుతోంది. ఈశాన్యం మూలగడ నేను విడిపోతానంటూ బయటికిఒరిగిపోయింది.

కొసలు కత్తిరించకుండా భోక్తలకివేసిన అరిటాకుల్లా ఉన్న ఆ రెండు పెంకుటిళ్ళూ మూలలు కలిపేచోట ఒక నుయ్యి ఉంది. దానిపక్కనే ఒక నిమ్మ చెటూ, రెండు కొబ్బరి చెట్లూను.

ఆ నూతి పళ్ళెంలో కూచుని పెదశాస్త్రి ప్రాతస్సంధ్య కానిస్తున్నాడు. చినశాస్త్రి అతని దగ్గరికి వెళ్ళాడు.

అర్ఘ్య ప్రదానం అయినట్టుంది. అక్కడికి ఆపి పెదశాస్త్రి అడుగుతున్నాడు—

"చెప్పొచ్చావా–?"

"ఊఁ——"

"సరే—వెళ్ళు—స్నానంచెయ్యింక–"

చినశాస్త్రి కదల్లేదు.

"యేం నిలబడ్డావ్? — స్నానం చెయ్యవా? సంధ్యవార్చవా?" నిమ్మళంగా గద్దించాడు పెదశాస్త్రి.

"వాళ్ళకి ఏదో అశౌచం వచ్చిందట. ఇవ్వాళ కుదరదన్నారు" బిక్కమొగం వేసుకుని నసిగాడు. మాట పూర్తయ్యే లోపులో చినశాస్త్రి గొంతు పూడుకుపోయింది.

"అశౌచమా?- సరే-ఏదోటి చేద్దాంలే. ఇంతలోనే ఏడుపెందుకు?- వెళ్ళు-స్నానం సంధ్యా కానీ—" అనేసి అక్కడికి సంధ్య ముగించి పెదశాస్త్రి లేచాడు.

తనకయితే వస్తులుండటం కొత్తకాదు. తన యిరవై యేళ్ళ వయసులోనూ, నాలుగేళ్ళ చదువులోనూ అది యెన్నోసార్లు జరిగిన చాలా సాధారణమయిన విషయం; అలవాటయిపోయింది. కానీ చినశాస్త్రి మాట! మరీ చిన్న పిల్లాడు. ఒక్కపూట భోజనానికి కాస్త ఆలస్యం అయితేనే అల్లల్లాడిపోతాడు. అలాంటిది ఒక పూట కాదు మొత్తం రోజంతా భోజనం లేకండా




కుదరటంలేదని ఈ మధ్యన మళ్ళీ హోటల్లో చేరాడు.

ఆయనంతా అదోరకం మనిషి. కొంత కాలం వంటా, కొంతకాలంహోటలూను. దేనికయినా జరుగుబాటు వున్నవాడు. నిజానికి ఈ చదువుకి రావలసినవాడు కాదు. ఏ పూర్వజన్మ సంస్కారమో ఇటు లాక్కొచ్చింది. సంస్కృతాంధ్రాల పట్ల ఆనువంశికమయిన అభిమానమే అందాం పోనీ.

స్నానానికి నూతి దగ్గరికి వస్తూ రెడ్డిగారు-"ఏం శాస్త్రిగారూ! సంధ్యని మరీ సంగ్రహించినట్టున్నారీ పూట" పలకరించాడు

వుండాలంటే- ఉండగలడా?— ఉంచటం భాగ్యమా?

తానిక్కడ చదువుతున్నాడు గదా అనే భరోసాతో వీళ్ళ నాన్న వీడిని ఈ చదువుకి ఇక్కడ చేర్పించి తన కప్పగించి వెళ్ళాడు. ఆనాటినుంచీ వీడి ఆలనాపాలనా తనతోపాటే ఉంచుకునితానేచూస్తున్నాడు. తన అదృష్టమో, వాడి అదృష్టమో తనకి వారాలిచ్చిన వాళ్ళందరూ వీడికీ వారాలిచ్చారు. తనవే ఊడిపోతాయేమోనని భయపడ్డాడు. కానీ, అలా జరగలేదు. కాలక్షేపం అవుతోంది. బాగానే వుంది. కానీ ఇలాంటి అశౌచాల్లాంటి అవాంతరాలువచ్చినప్పుడు ఇద్దరికీ ఇబ్బందే అవుతోంది.

వీళ్ళతో కలిపి ఆ హాస్టల్లో మొత్తం పదిమంది వుంటున్నారు. అందులో తొమ్మిది మంది వారాల్తో కాలక్షేపాలు చేస్తున్నవారే! పౌరోహిత్యం ముక్కల్తో పరువుగా బతకలేక పిల్లల్నయినా ఆవృత్తి నుంచి తప్పిద్దామని వీళ్ళలో కొందరి తల్లిదండ్రుల ఆశ. మరింకే చదువుకీ స్తోమతులేని కుటుంబాలవారు కొందరు. పైగా ఇది వారాలు దొరికే ఊరు. ఆయీ కారణాలు అన్నీకలిసి వీళ్ళని ఈ గూటిలో చేర్చాయి.

ఒక్క రెడ్డిగారు మాత్రం హోటల్లో భోంచేస్తున్నాడు ఆ మధ్యన కొంతకాలం వండుకుతిన్నాడు. వంటకీచదువుకీ లంగరు

ఆయె. మనసేదో కొంచెం వికలంగా వుంటేనూ—"

"వికలమా! అదేమిటండీ!" అంటూనే రెడ్డిగారు చేద నూతిలో వేశారు. ధబ్ మని చప్పుడయింది.

"అరే! నీళ్ళు చాలా పైకొచ్చేశాయండీ!" ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు.

"ఆయ! గోదావరి నుంచి పోటుమీద ఉందిటండీ!"

"అల్లాగా!— వెళ్ళి చూసిరావాలి సుమండీ!— ఇంతకీ మీరు కారణమేమిటో చెప్పారుగారు."

"కారణమంటూ ప్రత్యేకంగా ఏంలేదనుకోండి—కానీ— మన హాస్టల్లో కనీసం

ఒక్క విద్యార్థయినా వండుకు తినేవాడు ఉండటం చాలా అవసరంగా కనబడుతోందండీ—!"

"యేం అలా అంటున్నారు? ఈరోజు వారానికేమయినా—"

"ఆఁ—ఇబ్బందే వచ్చిందండీ—"

"అలాగా—పోనెండి — ఈ రోజు నాతోపాటు హోటలుకివచ్చేద్దురుగాని—"

"బాగు బాగు! హోటల్లో తినటమే!— తింటూండగా ఎవళ్ళయినా చూస్తే ఉన్న వారాలన్నీ ఊడిపోతాయి"

"అవునండోయ్! అదో ఇబ్బంది. ఇచ్చేవారెలా వున్నా పుచ్చుకునేవారు మాత్రం శుద్ధిగా వుండాలి. మరయితే ఇవ్వాళ—"

"ఇవ్వాళ ఇవ్వాళే! వేషానికే వెక్కిరిస్తున్నారు ఇంకా జోలి వేసుకుని మధుకరానికి బయలుదేరితే బతికినట్టే—! పస్తుండటమే—!"

"పస్తా?— మీరయితే ఉండగలరు— అలవాటేకనక— చినశాస్త్రి మాటేమిటని?"

"అదే ఆలోచిస్తున్నాను-పోనీ, ఏదోలా వంటకే ఏర్పాటు చేద్దామా అని చూస్తున్నాను—"

"అంతే చెయ్యండి! నాకూ ఇంకా మనియార్డరు అందలేదు. డబ్బులేమీ సర్దలేను గానీ వంటసామాన్లు వున్నాయి. ఇస్తాను. సామాగ్రికూడా మిగుళ్ళూ, తగుళ్ళూ ఏమున్నాయో చూడాలి. బహుశ ఉప్పు, చింతపండూ, మిరపకాయలూ ఇలాంటి ముడి పదార్థాలు కొద్దికొద్దిగా సీసాల్లోను, డబ్బాల్లోనూ ఉన్న గుర్తు. చూసి ఇస్తాను—"

"చాలు చాలు. అంతకంటే ఏం కావాలండీ!"

"తండులాని నసంతి. ఇది మాత్రం ఖాయం."

"అవీ్వ ఎక్కడో తడుముకోవాలి — 'నన్నాసిగాడి పెళ్ళికి జుట్టు దగ్గర్నించీ ఎరువే'నని.... స్నానం కానివ్వండి —" అంటూ పెదశాస్త్రి లోపలికి వెళ్ళాడు.

పోనీ ఈ రోజుకి ఏ గురువుగారింటికన్నా వెడదామా అనే ఆలోచన వచ్చింది పెదశాస్త్రికి. అయిదారు నెలలనించీ జీతాలులేక అందరూ యిబ్బందిపడుతున్నవాళ్ళే. వెడితే కాదనరు కానీ భావ్యం కాదుగదా అనిపించింది. పైగా యెన్నిసార్లనీ ఈతంత మందనీ! చదువు చెబుతున్న నేరానికి తిండికూడా వారే పెట్టాలా? వద్దంటే వద్దనుకున్నాడు.

శివాలయానికి వెళ్ళాడు. ఒక కొబ్బరి చిప్ప. నాలుగరటి పళ్ళో దొరికితే పోనీ చినశాస్త్రికి ఈ పూటకి కాలక్షేపం అయి


క్లాసులు ప్రారంభమయినవి

## 1982 ఫిబ్రవరి 20, 21 తేదీలలో

6వ తరగతిలోనికి ప్రవేశ పరీక్షలు జరుగును.

# సైనిక స్కూలు

## కోరుకొండ (ఎ. పి.)

★ బాలుర వయస్సు 1982 జూలై 1వ తేదీ నాటికి 10—12 సం॥ల మధ్య నుండవలెను. డిఫెన్సులోని, ఎక్సు సర్వీసు ఉద్యోగుల, సర్వీసు ఉద్యోగుల పిల్లలకు మరియు షెడ్యూలు కులములవారికి ప్రత్యేక రిజర్వేషనులు కలవు.

★ కోరుకొండ సైనిక స్కూలుతో సమానముగా ప్రారంభించి, చక్కటి హాస్టల్సు వసతితో పై పరీక్షలకు ఇంగ్లీషు మరియు తెలుగు మీడియంలలో శిక్షణ నిచ్చుటలో పేరెన్నికగన్న దక్షిణ భారత దేశమునందలి ప్రప్రథమ విద్యాసంస్థ.

ఫోన్ : 22084



# శ్రీ విద్యా విహార్

(ఆదర్శ గురుకుల విద్యాసంస్థ)

లలితానంద నగర్, రింగ్‌రోడ్,

గుంటూరు-522 006.

బ్రాంచి దాసరివారి వీధి. (కనకదుర్గాటాకీసు ఎదురు వీధి)

విజయవాడ-2

ప్రతి సంవత్సరము అత్యుత్తమ ఫలితాలకు, సైనికస్కూలులో చదువు వందలాది మా విద్యార్థులే మీకు నిదర్శనం.

## ఇంగ్లీషు, తెలుగు మీడియంలో

## నర్సరీ నుండి 10వ తరగతి వరకు

## క్లాసులు కలవు.

★ P. E. T. లు, ‌ హాస్టలు వార్డెనులు కావలెను.

పోతుంది. రాత్రికి చూసుకోవచ్చునులే అని శూన్యమాసం, శివాలయం పట్టి శివాలయంగానే ఉంది. ముఖపరిచయాన్ని పురస్కరించుకుని అవసరం వచ్చిందని అర్చకుణ్ణి ఒక రూపాయి అప్పుఅడిగాడు. అంతకన్నా ఎక్కువ అడిగితే అసలే లేదనవచ్చు. ఒక వేళ ఇచ్చినా తీర్చేదారి ?

ఆ రూపాయితో ఒక అరకిలో బియ్యం కొన్నాడు. డజను అర్ధరూపాయికి బేరమాడి ఒక అరడజను అరటిపళ్ళు తీసుకున్నాడు. నిజానికి అవ్వి బియ్యమూ కావు, ఇవ్వి పళ్ళూ కావు. ఎంతకంతే !

హాస్టలుకి వచ్చిరాగానే ఆ అరడజను అరటిపళ్ళూ చినశాస్త్రి చేతికిచ్చి—

"మధ్యాహ్నానికివి తిను — సాయంత్రానికి వంటచేసుకుందాం — క్లాసులకి వెడదాం పద—" అన్నాడు.

* * *

సాయం సంధ్య ముగించుకుని రెడ్డిగారి దగ్గర సామాన్లూ, సామగ్రి తీసుకున్నాడు. కుంపటి అంటించి అత్తెసరు పడెయ్యమని చినశాస్త్రికి పురమాయించి ఊళ్ళోకి బయలుదేరాడు. మళ్ళీ ఏమాలోచన వచ్చిందో ఏమో వెడుతున్న వాడల్లా ఆగి,

"అత్తెసరు వద్దులే-వార్పుకే పెట్టు-చిట్టుడుకు నీళ్లు కాసినితీసి రెండు నిమ్మకులు తుంపి పడెయ్." అని చెప్పి కదిలాడు.




# డబ్బు

## విసిరేవారెవరూ కనిపించకుండానే
## ఈ బంతి ఎన్నో చేతులు మారిపోతోంది

— మిరియాల రామకృష్ణ

వారం వారి యింట్లో అశౌచమేమిటో యెక్కడనుంచి వచ్చిందో కనుక్కుందామని వెళ్ళాడు. పరామర్శ అయింది.

అతని కళ్ళల్లో ఆకలే కనపడిందో, అతని మాటల్లో నీరసమే వినపడిందో— "మజ్జాన్నం భోంచేశావా నాయనా?" అని అడిగేసిందావిడ. చేశానన్నట్టు తల వూపాడు పెదశాస్త్రి. మరింక సాగదియ్యలేదావిడ.

అక్కడ సెలవు తీసుకుని పొద్దున్న బియ్యం కొన్న కిరాణా కొట్టుకి వెళ్ళాడు. ఈ పూట షావుకారుగారి పెద్దబ్బాయి ఉన్నాడు కొట్టుమీద. ఇదీ బాగానే ఉందిలే అనుకుంటూ లోపలికి వెళ్ళాడు. పొద్దుటలాగా బేరాల రద్దీ కూడా ఏమీలేదు. ఆహ్వానాలూ ఆదరాలూ అయ్యాక—

"పెద్దబ్బాయిగారూ ! నాలుగు కంది బద్దలు కావాలండీ అవసరమొచ్చింది—" అడిగాడు పెదశాస్త్రి.

"ఆయ ! తింటానికాండీ—?"

"ఊఁ— తినటానికే అనుకోండి !"

"పచ్చి పప్పేందింటారండీ !—" అంటూనే

"ఒరేయ్ ! యేంచిన సెనగపప్పట్టుకురా ఓ గుప్పెడు— శాస్తుర్లుగారు తింటారుట—"

లోపల సరుకులందించే కుర్రాడికి ఆజ్ఞ జారీచేశాడు పెద్దబ్బాయిగారు.

"అబ్బెబ్బే—అక్కర్లేదండి బాబూ!— సెనగపప్పు తినటానికి నేనేమన్నా చిన్నపిల్లాడినా ?—నాకు వారం ఇచ్చిన వారింట్లో ఏదో అవసరం వచ్చిందట—కందిపప్పు— మినప్పప్పు-ఖరీదులు ఎలావున్నాయో కనుక్కుని మచ్చులు పట్టుకు రమ్మన్నారు—"

"అలా చెప్పండి మరీ!— మచ్చులంట కట్టియ్యరా !—తలో గుప్పెడూను—నాలుగయిదు రకాలున్నాయిగా—" కుర్రాడికి మరో ఆజ్ఞ జారీ అయింది.

కట్టి ఇచ్చిన పొట్లాల్లో—"ఇంతింత ఎందుకండీ—"అంటూ సగంసగం తీయించేసి పొట్లాలమీద ఖరీదులు రాయించుకుని

పెదశాస్త్రి హాస్టలుకి చేరుకున్నాడు.

గొంతుకూర్చుని — అయివుంగ్ అరులుక్—అని లయబద్ధంగా చదువుతూ వెదురుపేళ్ళ విసినకర్రని నేలకీ,కుంపటికీ టపటప లాడిస్తూ తంటాలు పడుతున్నాడు చినశాస్త్రి.

"ఇంకా పుడుకు పట్టలేదా ?-విసరకులే-నిమ్మళంగా పుడకనీ-అది అయ్యాక-ఇదిగో ఈ పొట్లాల్లో కందిపప్పూ, మిన ప్పప్పూ వున్నాయి-రెండూ కలిపి దోరగా వేయించు-పచ్చడి చేసుకుందాం" అంటూ పొట్లాలు చినశాస్త్రి దగ్గర పడేశాడు.

"అబ్బ ! కందపచ్చడా !"

చినశాస్త్రికి అప్పుడే కడుపునిండి పోయినట్టయింది. ●


పాపాయికి పుట్టుకతోనే మీరిచ్చిన కానుక-3 నెలలకు సరిపడే ఐరన్



3 నెలలు నిండాక, కేవలం పాలే అతడికి కావలసిన ఐరన్‌ను సమకూర్చలేవు

అతడికి ఇవ్వండి

# ఫారెక్స్

పుష్కలంగా ఐరన్ గలది

"తల్లి నుంచి పెద్ద ఐరన్ నిల్వతో సహా పుడతాడు పాపాయి. అయితే పుట్టిన తర్వాత ఈ నిల్వ క్రమేపీ తరిగిపోతుంది. పాలు మంచి ఆహారమే అయినప్పటికీ, ఐరన్ లేనందువల్ల అది సంపూర్ణ ఆహారం కాదు. అందుకే పాపాయికి ఐరన్ గల ఆహారాలు కావాలి."

డాక్టర్ సుభాష్ సి. ఆర్య :
"ఇన్‌ఫెంట్ అండ్ చైల్డ్ కేర్ ఫర్ ది ఇండియన్ మదర్."

**డాక్టర్లు ఫారెక్స్ ఎందుకు సిఫార్సు చేస్తారు ?**

ద్రవ ఆహారాన్ని క్రమంగా తగ్గించి ఘన ఆహారాలు ప్రారంభించడం కోసం ప్రత్యేకంగా తయారుచేయబడిన ఆహారం ఫారెక్స్. మీ పాపాయి సున్నితమైన జీర్ణశక్తికి అనువుగా వుండేటట్లు ముందే పచనం చేయబడింది. దీనిలో సత్వర పెరుగుదలకు ప్రొటీన్లు; శక్తికోసం కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు; దృఢమైన ఎముకలు, గట్టి పళ్లకోసం కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్లు ఉన్నాయి. ఫారెక్స్‌లో పుష్కలంగా ఐరన్ కూడా ఉంది— అది మీ పాపాయి రక్తానికి, అతడి శరీర ఆరోగ్యానికి, అతడి పెరుగుదలకూ, వికాసానికి అతి ముఖ్యం.






డాక్టర్లు సిఫార్సు చేస్తారు ఫారెక్స్

సత్వరమైన, సంపూర్ణమైన పెరుగుదల కోసం పాపాయికి ఆదర్శవంతమైన ఘన ఆహారం

CA:GLF-30-203 Tel